ఆశ వర్కర్లను పర్మినెంట్ చేయాలి

సిద్దిపేట పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆశ వర్కర్లు

సిద్దిపేట, డిసెంబర్ 20: ఆశ వర్కర్లను కేంద్రం వెంటనే పర్మినెంట్ చేసి కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పద్మశ్రీ డిమాండ్ చేశారు. ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన బస్సుజాత శుక్రవారం సిద్దిపేట జిల్లాకు వచ్చిన సందర్భంగా సిద్దిపేట పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా పాత బస్టాండ్ నుంచి ప్రెస్ క్లబ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టెస్టుల టార్గెట్ పెట్టడం సరికాదన్నారు. దేశవ్యాప్తంగా ఆశ వర్కర్లు పది లక్షల మంది పని చేస్తున్నారని గుర్తుచేశారు. ఆశ వర్కర్లను కేంద్రం నేటికీ గుర్తించడం లేదన్నారు. అనంతరం వైద్యారోగ్యశాఖ అధికారికి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కాముని గోపాలస్వామి, జిల్లా కోశాధికారి గొడ్డుబర్ల భాస్కర్ ,జిల్లా సహాయకార్యదర్శి చొప్పరి రవికుమార్, బస్సు యాత్రలో ఆశ రాష్ట్ర అధ్యక్షురాలు పి.జయలక్ష్మి, ప్రధాన కార్యదర్శి నీలాదేవి,ఆశ యూనియన్ జిల్లా కార్యదర్శి బి.ప్రవీణ,అధ్యక్షురాలు మంజుల, భాగ్యలక్ష్మి,లక్ష్మి,యాదలక్ష్మి,బాలమని,అరుణ,రేణుక,భాగ్య,కవిత, శోభ,రజిత,జ్యోతి పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలి

సిద్దిపేట టౌన్,డిసెంబర్ 20 : ఆశ వర్కర్లను కేంద్ర ప్రభుత్వం వెంటనే పర్మినెంట్ చేసి కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పద్మశ్రీ డిమాండ్ చేశారు. ఆశ వర్కర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన బస్సు జాత సిద్దిపేటకు చేరుకున్న సందర్భంగా స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆశ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. సర్వేలు చేయించుకొని డబ్బులు ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు.సమావేశంలో నేతలు గోపాల స్వామి, భాస్కర్, రవికుమార్, జయలక్ష్మి, నీలాదేవి పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

మద్దూరులో మాట్లాడుతున్న డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

మద్దూరు(ధూళిమిట్ట), డిసెంబర్20: టెన్త్‌లో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా జిల్లా విద్యాశాఖ పనిచేస్తున్నట్లు డీఈవో శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మద్దూరులోని ఉన్నత పాఠశాల, కస్తూర్బాపాఠశాలలతో పాటు సలాఖపూర్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. పదో తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడారు. మద్దూరులో మ్యాథమెటిక్స్ క్విజ్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ మార్కులు సాధించాలన్నారు. సాయంత్రం కొనసాగుతున్న ప్రత్యేక తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంఈవో వరదరాజు, హెచ్ఎం చంద్రశేఖరశర్మ, టీచర్లు పాల్గొన్నారు.

రాజకీయ కక్షతోనే కేటీఆర్‌పై కేసు

కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకుల మండిపాటు

చేర్యాలలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ స్వరూపరాణీశ్రీధర్‌రెడ్డి తదితరులు

మద్దూరు(ధూళిమిట్ట): మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మేక సంతోష్‌కుమార్ తదితరులు

కొమురవెల్లి: మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గీస భిక్షపతి

చేర్యాల: మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అనంతుల మల్లేశం

కొండపాక(కుకునూరుపల్లి): సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీటీసీల ఫోరం మాజీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవీరవీందర్

మద్దూరు(ధూళిమిట్ట), డిసెంబర్ 20:రాజకీయ కక్షతోనే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై రేవంత్‌రెడ్డి సర్కారు అక్రమ కేసులు పెట్టిందని బీఆర్ఎస్ మద్దూరు, ధూళిమిట్ట మండల శాఖ అధ్యక్షులు మేక సంతోష్‌కుమార్, మంద యాదగిరి మండిపడ్డారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ గతంలో ఐటీ శాఖ మంత్రిగా కేటీఆర్ తెలంగాణ ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పారని గుర్తు చేశారు. ఫార్ములా-ఈ కారు రేసుతో తెలంగాణకు పెద్ద మొత్తంలో పెట్టుబడులు వచ్చాయన్నారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా అవతరించిందన్నారు. ఏడాది కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు చేసింది శూన్యమన్నారు. ప్రభుత్వం ఎన్ని కేసులు పెట్టినా ప్రజల తరఫున బీఆర్ఎస్ పోరాటాలు చేస్తుందన్నారు. సమావేశంలో మాజీ వైస్ ఎంపీపీ మలిపెద్ది సుమలతామల్లేశం, పీఏసీఎస్ చైర్మన్ నాగిళ్ల తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్ ఇర్రి రాజిరెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మాజీ మండల అధ్యక్షులు వంగ భాస్కర్‌రెడ్డి, చొప్పరి వరలక్ష్మీసాగర్, మాజీ ఎంపీటీసీలు గుజ్జుక సమ్మయ్య, ఖుర్గు నర్సింహులు, మాజీ సర్పంచ్‌లు సుదర్శన్, ఊట్ల రవీందర్‌రెడ్డి, సుందరగిరి స్రవంతీపరశురాములు, బొల్లు కృష్ణవేణీచంద్రమౌళి, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు దామెర మల్లేశం, నాయకులు నల్ల బాల్‌రెడ్డి, కాసర్ల కనకరాజు, మంద సుమన్, శెట్టె ఐలయ్య, పుప్పాల బాలస్వామి, సిద్ధిఖీ పాల్గొన్నారు.

కేసీఆర్ కుటుంబంపై అక్రమ కేసులు పెడుతున్రు

కొండపాక(కుకునూరుపల్లి), డిసెంబర్ 20 : రాజకీయంగా బీఆర్ఎస్ పార్టీని ఎదుర్కొనే దమ్ము లేక కేసీఆర్ కుటుంబంపై అక్రమ కేసులు పెడుతున్నారని ఎంపీటీసీల ఫోరం మాజీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవీ రవీందర్ ఆరోపించారు. కుకునూరుపల్లిలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని ప్రపంచానికి గొప్పగా పరిచయం చేసి హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ని పెంచిన మాజీ మంత్రి కేటీఆర్‌పై అక్రమ కేసులు బనాయించడం చూస్తే ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతు నొక్కాలని చూస్తున్నదని విమర్శించారు. యావత్ తెలంగాణ ప్రజలంతా కేటీఆర్ వెంటే ఉన్నారని, వెంటనే అక్రమంగా పెట్టిన కేసును ఉపసంహరించుకోవాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. సమావేశంలో మాజీ సర్పంచ్ మహిపాల్, పాల రమేశ్‌గౌడ్, మామిడి కృష్ణ, దినేశ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ చేసిందేమీలేదు

కొమురవెల్లి, డిసెంబర్ 20 : కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం దాటినా ప్రజలకు చేసిందేమీ లేదని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గీస భిక్షపతి అన్నారు. కొమురవెల్లిలో మాజీ మంత్రి కేటీఆర్‌పై ప్రభుత్వం అక్రమ కేసు పెట్టడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా పేదలకు చేసిందేమీలేదని మండిపడ్డారు. తెలంగాణ తల్లి రూపాన్ని మార్చడం తప్పా ప్రజలకు కొత్త పథకాలు అమలుచేయలేదని దుయ్యబట్టారు. రేవంత్ రెడ్డి కావాలనే కేటీఆర్ పై కక్షపూరితంగా ఈ ఫార్ములా రేసు కేసులో ఇరికించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తుందని విమర్శించారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ సిలువేరు సిద్ధప్ప, రసూలాబాద్ మాజీ సర్పంచ్ పచ్చిమడ్ల స్వామిగౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తలారి కిషన్, ఏర్పుల మహేశ్, సార్ల సురేశ్, పచ్చిమడ్ల వెంకటేశ్‌గౌడ్, అన్నబోయిన సురేశ్, కొండ మల్లేశ్ పాల్గొన్నారు.

చేర్యాలలో...

చేర్యాల, డిసెంబర్ 20 : మార్పు అంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చ లేక కేటీఆర్ పై అక్రమ కేసు బనాయించిందని మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణీశ్రీధర్‌రెడ్డి, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ముస్త్యాల బాల్‌నర్సయ్య ఆరోపించారు.పట్టణంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రపంచ స్థాయిలో తెలంగాణకు గుర్తింపు తీసుకువచ్చేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫార్ములా ఈ రేసును హైదరాబాద్‌లో నిర్వహించడంతో రూ.700కోట్ల పెట్టుబడులు వచ్చాయన్నారు.సమావేశంలో ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ పుర్మ వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్ పచ్చిమడ్ల సతీశ్‌గౌడ్, మండల అధ్యక్షుడు అనంతుల మల్లేశం, యూత్ ఇన్‌చార్జి శివగారి అంజయ్య, టౌన్ సెక్రటరీ బూరగోని తిరుపతిగౌడ్, నాయకులు రామచంద్రం, బీరెడ్డి ఇన్నారెడ్డి, పచ్చిమడ్ల సిద్దిరాములుగౌడ్, కోతి దాసు, బంగారిగల్ల కిరణ్ పాల్గొన్నారు.

కేటీఆర్‌పై కేసు కక్ష సాధింపు చర్యనే

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ఏసీబీ కేసు కక్షసాధింపు చర్య అని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అనంతుల మల్లేశం అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేవంత్ సర్కారు కేటీఆర్‌ను ఇబ్బంది పెట్టేందుకు కేసు నమోదు చేయించిందన్నారు. కాంగ్రెస్ సర్కారు కేసులు పెడితే గులాబీ శ్రేణులు బయపడిపోరనే విషయాన్ని రేవంత్ సర్కారు గుర్తించాలన్నారు. బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు రాజేశ్‌గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి కోతి దాసు, నాయకులు అరిగే కనకయ్య, శనిగరం లక్ష్మణ్, ఎర్రోళ్ల యాదగిరి, జంగిటి భిక్షపతి, సోషల్ మీడియా మండల అధ్యక్షుడు కిరణ్,తాళ్లపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజల దృష్టి మళ్లించేందుకే తప్పుడు ప్రచారం

బెజ్జంకి, డిసెంబర్ 20: హామీలు అమలు చేయకుండా ప్రజల దృష్టి మళ్లించేందుకే కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తున్నదని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలో స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌కు ఫార్ములా ఈ రేస్ రావడం గర్వకారణమన్నారు. రాజకీయ కక్షకోసం హైదరాబాద్ ప్రతిష్టను కాంగ్రెస్ ప్రభుత్వం దిగజార్చే ప్రయత్నం చేయడం సిగ్గుచేటన్నారు.

కుట్రపూరితంగానే కేటీఆర్‌పై కేసు నమోదు

గజ్వేల్, డిసెంబర్ 20: కుట్రపూరితంగానే ప్రభుత్వం కేటీఆర్‌పై కేసు నమోదు చేయించిందని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు చెప్యాల రాజేశ్వర్‌రావు అన్నారు. హైదరాబాద్‌ను ఐటీరంగంలో అగ్రగామిగా నిలిపిన ఘనత కేటీఆర్‌కే దక్కుతుందన్నారు.తెలంగాణ ఉద్యమ సమయంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వెన్నంటి ఉన్న తెలంగాణ ఉద్యమకారులు కేటీఆర్‌కు అండగా ఉంటారన్నారు. కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు రేవంత్ సర్కారు తీరు ఉందన్నారు.

హుస్నాబాద్‌లో ఫ్లాగ్‌మార్చ్

హుస్నాబాద్‌లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న రాపిడ్ యాక్షన్‌ఫోర్స్, స్థానిక పోలీసులు

హుస్నాబాద్, డిసెంబర్ 20: హుస్నాబాద్ పట్టణంలో స్థానిక పోలీసులు, స్పెషల్ యాక్షన్ ఫోర్స్ ఆధ్వర్యంలో శుక్రవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ నుంచి ప్రారంభమైన ఫ్లాగ్‌మార్చ్ మల్లెచెట్టు చౌరస్తా, మెయిన్‌రోడ్డు, అంబేద్కర్ చౌరస్తా, హనుమకొండ రోడ్డు, మార్కెట్ యార్డు నుంచి తిరిగి పోలీస్‌స్టేషన్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ శాంతిభద్రతల సమస్య తలెత్తినప్పుడు వెంటనే అక్కడికి చేరుకొని పరిస్థితులను అదుపులోకి తీసుకొని శాంతియుత వాతావరణాన్ని కల్పించడమే స్పెషల్ రాపిడ్ యాక్షన్ ఫోర్స్ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో రాపిడ్ యాక్షన్ ఫోర్స్ డిప్యూటీ కమాండెంట్ టీపీ బగేల్, ఇన్‌స్పెక్టర్లు హరిబాబు, మల్లేశ్వర రావు, స్థానిక ఎస్సైలు మహేశ్, అభిలాష్, రాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

చేర్యాలలో పోలీసులు అరెస్ట్ చేసిన ఏఐఎస్ఎఫ్ నాయకులు

హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్‌లో జనార్దన్ తదితరులు

చేర్యాల, డిసెంబర్ 20 : హామీల అమలులో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని ఏఐఎస్ఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రామగల్ల నరేశ్ ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ ఇచ్చిన చలో అసెంబ్లీ పిలుపు మేరకు స్థానిక నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి సర్కారు విద్యారంగాన్ని పూర్తిగా గాలికి వదిలివేసిందని మండిపడ్డారు. నూతన జాతీయ విద్యా విధానం దేశానికి ప్రమాదకరమన్నారు.అరెస్టులతో విద్యార్థి ఉద్యమాలను ఆపలేరని, వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.పోలీసులు అరెస్టు చేసిన వారిలో మండల కార్యదర్శి ఎస్‌కే యాసిన్, మండల ఉపాధ్యక్షుడు ఎద్దు కార్తిక్, నాయకుడు అభినయ్ ఉన్నారు.

ప్రభుత్వం విఫలం

హుస్నాబాద్, డిసెంబర్ 20: విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జేరిపోతుల జనార్దన్ అన్నారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన చలో అసెంబ్లీ సందర్భంగా ఆయనతో పాటు పలువురు నాయకులను హుస్నాబాద్ పోలీసులు అరెస్టు చేశారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వర్ణోత్సవ సంబురం

సిద్దిపేట టౌన్,డిసెంబర్ 20 : సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవ సంబురం శుక్రవారం అట్టహాసంగా జరిగింది.కళాశాలలో 1974లో డిగ్రీ చదివిన పూర్వవిద్యార్థుల అపూర్వ సమ్మేళానికి కళాశాల సమావేశం మందిరం వేదిక అయింది. కళాశాలలో చదువుకున్న పూర్వవిద్యార్థులు 50 ఏండ్లు పూర్తి అయిన సందర్భాన్ని పురస్కరించుకొని అపూర్వ సమ్మేళనం ఏర్పాటు చేశారు.విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. స్వర్ణోత్సవ వేడుకల వేదిక కమిటీ సభ్యులు హరిశ్చంద్ర, అమ్మన చంద్రారెడ్డి,మహిపాల్‌రెడ్డి, గణేశ్, బూర మల్లేశం,గోపాల్‌రావు పాల్గొన్నారు.

సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వర్ణోత్సవ సంబురాల్లో పూర్వవిద్యార్థులు

జిల్లా వ్యాప్తంగా అమిత్‌షా దిష్టిబొమ్మలు దహనం

గజ్వేల్: కొడకండ్లలో అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

రాంసాగర్‌లో అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

చేర్యాలలో అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం చేస్తున్న మాలమహానాడు నాయకులు

మిరుదొడ్డి: అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఆయావర్గాల ప్రజలు

బెజ్జంకిలో...

కొమురవెల్లి, డిసెంబర్ 20 : పార్లమెంట్‌లో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై అనుచిత వాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని సీపీఎం మండల కార్యదర్శి రవీందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని రాంగసాగర్‌లో అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎస్ఎఫ్ఐ చేర్యాల డివిజన్ కార్యదర్శి భరత్‌కుమార్, నాయకులు మల్లేశం, రాజలింగం, గణేశ్, నర్సయ్య, రాజయ్య, బాలమల్లయ్య పాల్గొన్నారు.

కొడకండ్లలో...

గజ్వేల్, డిసెంబర్ 20: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని మండలంలోని కొడకండ్లఅంబేద్కర్ సంఘం అధ్యక్షుడు చంద ప్రవీణ్ డిమాండ్ చేశారు. గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం నుంచి చౌరస్తా వరకు భారీ ర్యాలీ అనంతరం అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. అంబేద్కర్ సంఘం నాయకులు రాజు, అశోక్, భూమయ్య, వేణుగోపాల్, కుక్కల శ్రీనివాస్,ఎడ్ల రవి, వేణు, బాలచంద్రం, బాలకృష్ణ, రవి, ప్రవీణ్, నరేశ్, హరిబాబు, మనోజ్ పాల్గొన్నారు.

సిద్దిపేటలో..

సిద్దిపేట,డిసెంబర్ 20: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు జంజీరపు ఎల్లేశ్ తెలిపారు.సిద్దిపేట పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఫ్లెక్సీకి మాల మహానాడు నాయకులు శవయాత్ర నిర్వహించి దహనం చేశారు

మిరుదొడ్డిలో ..

మిరుదొడ్డి, డిసెంబర్ 20 : మండలం కేంద్రంలో డాక్టర్ అంబేద్కర్ విగ్రహం వద్ద అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. మాల మహనాడు మండల అధ్యక్షుడు దారస్వామి, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు రాజేశం, మాజీ సర్పంచ్ బాల్‌రాజు, ఆయా వర్గాల ప్రజలు కిష్టయ్య, సుదర్శన్, దారమల్లయ్య, మద్దెల చంద్రం, లింగం., మల్లేశం, రాజు, మల్లయ్య పాల్గొన్నారు.

చేర్యాలలో....

చేర్యాల, డిసెంబర్ 20 : మాలమహానాడు ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుట్టి సత్యనారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు కమలాపురం కిష్టయ్య, పుట్ట రాజు, చంద శ్రీకాంత్, పాకనాటి భాస్కర్, కనకయ్య, శ్రీనివాస్, అనిల్, భాస్కర్,ప్రభాకర్ పాల్గొన్నారు.

అంబేద్కర్ చౌరస్తాలో ..

హుస్నాబాద్, డిసెంబర్ 20: మాల మహనాడుతో పాటు పలు సంఘాల ఆధ్వర్యంలో హుస్నాబాద్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో అమిత్‌షా ఫ్లెక్సీని దహనం చేశారు. మాల మహనాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్న రాజు, ఆయా సంఘాల నాయకులు కిశోర్, బిక్యానాయక్, శ్రీనివాస్, కైలు నాయక్, గడ్డం సదానందం, జాల శ్రీనివాస్, సుమన్, సతీశ్, బాలయ్య, కొమురయ్య, సురేశ్, అయిలేశ్‌యాదవ్, ఆనంద్, సంజీవరావు, రాజు, రాములు, సాంబరాజు పాల్గొన్నారు

బెజ్జంకిలో ..

బెజ్జంకి, డిసెంబర్ 20: మండల కేంద్రంలో దళిత సంఘాల నాయకులు అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. బాలనర్సు, రూపేశ్, రాజ్‌కుమార్, మధు, బాబు, మోహన్, ఆనంద్, శంకర్, తిరుపతి పాల్గొన్నారు.

హుస్నాబాద్‌లో అమిత్‌షా ఫ్లెక్సీని దహనం చేస్తున్న నాయకులు

దేశానికి యువకులే వెన్నుముక

మిరుదొడ్డి, డిసెంబర్ 20 : దేశానికి యువకులే వెన్నుముక అని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, రన్ ఫర్ యాంటీ డ్రగ్స్ వ్యవస్థాపక చైర్మన్ తోట కమలాకర్‌రెడ్డి అన్నారు. రన్ ఫర్ యాంటీ డ్రగ్స్ కార్యక్రమంలో భాగంగా చెప్యాలలో గంజాయి, డ్రగ్స్ మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా 2 కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చని పల్లెల్లో యువకులు పాశ్చత్య దేశాల మత్తు పదార్థాల ఉచ్చులో పడి వాటిని సేవిస్తూ కుటుంబాలను రోడ్డున పడేయవద్దన్నారు. మాజీ సర్పంచ్ బాల్‌రాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ సత్యనారాయణ, నేతలు లింగం, ఐలయ్య, రాజు, కుమార్, బైరయ్య పాల్గొన్నారు.

ముందస్తు ఆటో డ్రైవర్ల అరెస్టు

మద్దూరు పీఎస్‌లో అరెస్ట్ అయిన ఆటోడ్రైవర్లు

మద్దూరు(ధూళిమిట్ట), డిసెంబర్20: సమస్యల పరిష్కారం కోసం అసెంబ్లీ ముట్టడికి ఆటో డ్రైవర్లు పిలుపునిచ్చిన నేపథ్యంలో శుక్రవారం ఉమ్మడి మద్దూరు మండలంలోని వారిని పోలీసులు ముందస్తు అరెస్టు చేసి, మద్దూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా పలువురు ఆటో డ్రైవర్లు మాట్లాడుతూ ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులందరూ ధ్యానం చేయాలి

ధ్యానంతో కలిగే ప్రయోజనాలను వివరిస్తున్న హార్ట్‌ఫుల్‌నెస్ మెడిటేషన్ శ్రీ రామచంద్ర మిషన్ సభ్యులు

సిద్దిపేట కమాన్, డిసెంబర్ 20 : విద్యార్థులు ధ్యానం చేయడం అలవాటు చేసుకోవాలని హార్ట్‌ఫుల్ నెస్ మెడిటేషన్ శ్రీ రామచంద్రమిషన్ కో ఆర్డినేటర్ స్వరూపారాణి అన్నారు. హార్ట్‌ఫుల్‌నెస్ మెడిటేషన్ శ్రీ రామచంద్ర మిషన్ ఈ నెల 21 ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థులందరికీ ధ్యానం వల్ల కలిగే ప్రయోజనాల గురించి ప్రిన్సిపాల్‌తో కలిసి వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులతో పాటు లెక్చరర్స్ పాల్గొన్నారు.

విద్యార్థి దశే కీలకం

సిద్దిపేట టౌన్,డిసెంబర్ 20 : విద్యార్థి దశే కీలకమైందని సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్,మహిళా పోలీస్ స్టేషన్ సీఐ దుర్గ సూచించారు. సిద్దిపేట నారాయణ హైస్కూల్‌లో శుక్రవారం మహిళల రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..విద్యార్థులు అపరిచిత వ్యక్తుల మాటలను నమ్మవద్దన్నారు. విద్యార్థులు సమయం వృథా చేయవద్దని సూచించారు.విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు.నారాయణ హైస్కూల్ ప్రిన్సిపాల్ రమ్య,ఉపాధ్యాయులు,మహిళా పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా రక్షణ చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ దుర్గ

కొండపోచమ్మ ఆలయం వద్ద బహిరంగ వేలం

జగదేవపూర్, డిసెంబర్ 20: కొండపోచమ్మ దేవాలయం ఉత్సవాలకు సంబంధించిన వేలం పాటను ఆలయ కార్యనిర్వహణ అధికారి రవికుమార్, దేవాదాయశాఖ అధికారులు, ఆలయ ధర్మకర్తల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. కొబ్బరికాయల విక్రయానికి గాగురవన్నపేటకు చెం దిన లావణ్యారమేశ్ రూ.18లక్షలకు వేలం ద్వారా దక్కించుకున్నారు. ఒడిబియ్యం సేకరణకు చాట్లపల్లికి చెందిన అశోక్ రూ17.27 లక్షలు పాడి దక్కించుకున్నారు. కొబ్బరి ముక్కల సేకరణకు రూ.5.61 లక్షలు పాడి తీగుల్‌నర్సాపూర్‌కు చెందిన అశోక్, ఆలయ దుకాణా షట్టర్లను నెలకు రూ.17500 కిరాయి చొప్పున బచ్చలి కిశోర్, తడకల పందిరి వేయడానికి రూ95వేలకు మర్పడ్గ గ్రామానికి చెందిన నర్సింహులు దక్కించుకున్నారు. కార్యక్రమంలో బుగ్గ రాజేశ్వరి టెంపుల్ సూపర్‌వైజర్ శ్రీదర్‌రెడ్డి, సిద్దిపేట వేంకటేశ్వరస్వామి టెంపుల్ సూపర్‌వైజర్ చంద్రకుమార్, సిద్దిపేట హనుమాన్ టెంపుల్ సూపర్‌వైజర్ శ్రీకాంత్‌రెడ్డి, ఎస్సై చంద్రమోహన్, తీగుల్‌నర్సాపూర్ మాజీ సర్పంచ్ రజితారమేశ్, మాజీ చైర్మన లక్ష్మీనర్సింహారెడ్డి, ఆలయ ధర్మకర్తలు ఆశయ్య, నరేశ్, సీనియర్ అసిస్టెంట్ మహేందర్‌రెడ్డి, ఆలయ అధికారులు కనకయ్య, సిబ్బంది హరిబాబు, చిన్న, అంజయ్య, గ్రామ నాయకులు కనకయ్య, స్వామి, శ్రీను,మహిపాల్, యాదగిరి పాల్గొన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

సిద్దిపేట, డిసెంబర్ 20: అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని పెద్దలింగారెడ్డిపల్లిలో చోటుచేసుకుంది. సిద్దిపేట రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కొమ్మరాజుల కనకయ్య(48) కూలి పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఇద్దరు బిడ్డల పెండ్లి చేశాడు. ఇందుకు రూ.15 లక్షల వరకు అప్పులయ్యాయి. అప్పులు తీర్చేందుకు ఇంటి కాగితాలు, ట్రాక్టర్ తాకట్టు పెట్టి మళ్లీ అప్పు తెచ్చుకున్నాడు. అప్పుల భారం మరింత పెరిగింది. గురువారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిపోయి కాలనీకి వెనుక వైపు ఉన్న లింగాల జైపాల్ మామిడితోటలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు తెలిపారు.

పోలీసుల తనిఖీ

కొండపాక(కుకునూరుపల్లి), డిసెంబర్ 20 :సిద్దిపేట సీపీ ఆదేశాల మేరకు శుక్రవారం కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో కుకునూరుపల్లిలోని పాన్‌డబ్బాలు, కిరాణాదుకాణాలతోపాటు అనుమానాస్పద ప్రాంతాల్లో గంజాయి, ఇతర మత్తు పదార్థాల నివారణ కోసం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గంజాయి, మత్తు పదార్థాల బారిన పడకుండా తల్లిదండ్రులు పిల్లలను కనిపెడుతూ ఉండాలన్నారు.

పశువుల షెడ్ ధ్వంసం

గజ్వేల్, డిసెంబర్ 20: మండల పరిధిలోని కొడకండ్ల గ్రామానికి చెందిన రైతు దూలం రాజాగౌడ్ వ్యవసాయ పొలం వద్ద పశువుల కోస రేకులతో షెడ్ నిర్మించాడు. గురువారం రాత్రి వ్యవసాయపొలం వద్ద పశువులను రేకుల షెడ్‌లో కట్టేసి వచ్చాడు. ఉదయం వెళ్లి చూసే సరికి రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రేకుల షెడ్‌ను ధ్వంసం చేయడంతో నష్టం జరిగిందని బాధిత రైతు తెలిపాడు. ఈమేరకు కుకునూర్‌పల్లి పీఎస్‌లో ఆయన ఫిర్యాదు చేశాడు.

BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR AT KARIMNAGAR.
ABR No. M/KA 188 OF 2024
Between:-
M/s. Margadarsi Chit Fund Private Limited, Karimnagar Branch.
....Disputant.
AND
K. Srinivasa Rao & Others
.... Opponents.

NOTICE

To,
Opponent No. 4. Baddam Srinivas, S/o. Prathap Reddy, H.No. 1-47, Yellaipally, Allipur, Mdl: Chinnakodur, Dist: Siddipet.

Take notice that the above Dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, but you have failed to receive the same. The above dispute is posted **24 JAN 2025** for your appearance. On that day you have to appear in person at 11:00 A.M. before the Deputy Registrar referred above. Other-wise the case will be decided ex-parte.

Sd/- **DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR, KARIMNAGAR.**